క్లుప్తంగా

దళితులపై దాడి అమానుషం

సత్తెనపల్లి: దళిత మహిళపై దాడి చేయడం అమానుషం అని కాంగ్రెస్ పార్టీ సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి చుక్కా చంద్రపాల్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. చంద్రపాల్ మాట్లాడుతూ దర్శి మండలం బొట్లపాలెం ఎస్సీ కాలనీలో దళిత మహిళలపై దాడి చేసిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరి జ్ఞాన్ రాజ్ పాల్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, పీసీసీ కార్యదర్శి మాదంశెట్టి వేదాద్రి, నాయకులు టి.రామకృష్ణ, కె.ఆనంద్, జి.కన్నా, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు జిల్లెళ్ల పాల్ రాజ్ పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ గదుల బహిరంగ వేలం

సత్తెనపల్లి: పురపాలక సంఘ పరిధిలోని షాపింగ్ కాంప్లెక్స్ గదులు అద్దెకు ఇచ్చుటకు ఈ నెల 19న ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి శుక్రవారం తెలిపారు. పట్టణంలోని ఎన్టీఆర్ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్, యర్రం వెంకటేశ్వరరెడ్డి మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్, వావిలాల గోపాల కృష్ణయ్య మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో గదుల వేలం ఉంటుందని చెఆప్పరు.

ఈ క్రాప్ నమోదుతో రైతులకు లబ్ధి



నకరికల్లు: ఖరీఫ్ 2023లో సాగుచేస్తున్న పంటల వివరాలను తప్పనిసరిగా ఆర్‌బీకే సిబ్బందిని సంప్రదించి ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. మండలంలోని నర్శింగపాడు గ్రామంలో ఈ–పంట నమోదు ప్రక్రియను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ–పంట నమోదు చేసుకుంటే వ్యవసాయశాఖ తరఫున చేపడుతున్న సంక్షేమ పథకాలు పొందవచ్చన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో నూతనంగా జియో ఫెన్సింగ్ విధానం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. కౌలు రైతులు, ఆర్‌ఓఎఫ్‌ఆర్ రైతులు, పంట వివరాలు నమోదు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు షేక్ జాన్‌అహ్మద్ పాల్గొన్నారు.

21న రాష్ట్ర మహాసభ



గురజాల: విజయవాడలో ఈ నెల 21వ తేదీ నుంచి రెండు రోజుల పాటు జరగనున్న ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఎన్‌జీఓ సంఘం నాయకుడు హనుమంతరావు కోరారు. ఈ మహాసభలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

మాచవరంలో

మాచవరం: ఏపీఎన్‌జీఓ మహాసభను జయప్రదం చేయాలని ఎన్‌జీఓ సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు పట్టాభి పిలుపునిచ్చారు. మహాసభకు సమీకరణలో భాగంగా స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దారు ప్రసాద్, హెల్త్ సూపరవైజర్లు సురేష్, శ్రీనివాసరావు, చిన్నారి రోజీ పాల్గొన్నారు.

21తో ముగియనున్న ఓటర్ల జాబితా సర్వే

శావల్యాపురం: ఓటర్ల జాబితా నమోదు కార్యక్రమం వేగవంతం చేయాలని తహసీల్దారు షేక్ జాన్‌సైదులు అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 32 వేల 810 ఓట్లు ఉండగా 34 పోలింగ్ కేంద్రాల పరిధిలోని బీఎల్‌వోలు 23 వేల 563 మంది ఓటర్ల సర్వే పూర్తి చేసినట్లు చెప్పారు. ఈనెల 21న ఓటర్ల జాబితా సర్వే ప్రక్రియ ముగుస్తుందన్నారు. ఫామ్–6 అర్జీ లు సమగ్ర సమచారంతో ఆన్‌లైన్లో నమోదు చేసుకోవాలన్నారు. సర్వే ప్రక్రియలో బీఎల్‌వోలు తమ విధులు అంకిత భావంతో నిర్వహించటంతో పాటు అన్నీ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు తమవంతు సహకారం అందించాలన్నారు. ఆయనతో పాటు ఆర్‌ఐ చంద్రబాబు, పి.నాసరయ్య ఉన్నారు.

వివాహిత ఆత్మహత్య

చిలకలూరిపేట టౌన్: భార్యభర్తల మధ్య వివాదం నేపథ్యంలో భార్య ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొన్న సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం మండలంలోని తాతపూడి గ్రామానికి చెందిన నర్రా సురేష్‌తో మృదుల (31)కు ఎనిమిది సంవత్సరాల కిందట వివాహమైంది. వీరికి ఏడు సంవత్సరాల కుమారుడు ఉన్నాడు. ఈ నెల 16 తేదీ భార్యభర్తలకు మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో మృదుల 17వ తేదీ తెల్లవారు జామున అందరూ నిద్రిస్తున్న సమయంలో చీరెతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన భర్త, బంధువులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రూరల్ పోలీసులు మృతురాలి తండ్రి గరికపాటి వేణు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా శ్రావణ శుక్రవారం పూజలు



పట్టణంలో ప్రత్యేక అలంకరణలో వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు



ప్రత్యేక అలంకారంలో పార్వతీదేవి



చాగంటివారిపాలెంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



అమరావతిలోని బాలచాముండేశ్వరిదేవి అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహిస్తున్న దృశ్యం

అమరావతి: శ్రావణమాసంలో శుక్రవారం నాడు నిర్వహించే మంగళగౌరి వరలక్ష్మీ వ్రతాన్ని మండలంలో పలు దేవాలయాలలో భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అమరేశ్వరాలయంలో బాల చాముండేశ్వరి, జ్వాలాముఖీ అమ్మవార్ల వద్ద శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా కలశస్థాపన చేసి పూజ నిర్వహించారు. అనంతరం పిండి వంటలతో కూడిన వాయినాన్ని సమర్పించి భక్తిశ్రద్ధలతో యథాశక్తి ధూపదీప నైవేద్యాలు నిర్వహించారు. ముత్తయిదువులు వరలక్ష్మీ వ్రతం అనంతరం ఒకరికి ఒకరు వాయినాలు ఇచ్చుకుని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.

సత్తెనపల్లిలో..

సత్తెనపల్లి: శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని పట్టణం, మండలంలోని వివిధ ఆలయాలలో ప్రత్యేక పూజలు భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలల్లో గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై శ్రావణ లక్ష్మికి స్వాగతం పలికారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి.

అచ్చంపేటలో..

అచ్చంపేట: అధిక మాసం తరువాత వచ్చిన నిజ శ్రావణమాసం మొదటి శుక్రవారాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక హరిహర క్షేత్రంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో పార్వతీమాతను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆర్యవైశ్యుల ఆరాధ్యదేవత వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఆలయ పూజారి బలరామాచార్యులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజు చేశారు.

శ్రావణ శుక్రవారం పూజలు

ముప్పాళ్ల: మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో శ్రావణ శుక్రవారం పూజలు నిర్వహించారు. చాగంటివారిపాలెంలోని జగన్నాథస్వామి ఆలయంలో స్వామికి అభిషేకాలు, చామంతి పూలతో విష్ణుసహస్రనామపూజ, గీతాపారాయణం, విష్ణుసహస్ర నామ పారాయణం చేశారు. అనంతరం భజన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని పొంగళ్లు సమర్పించారు.

మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో శ్రావణ శుక్రవారం పూజలు నిర్వహించారు. చాగంటివారిపాలెంలోని జగన్నాథస్వామి ఆలయంలో స్వామికి అభిషేకాలు, చామంతి పూలతో విష్ణుసహస్రనామపూజ, గీతాపారాయణం, విష్ణుసహస్ర నామ పారాయణం చేశారు. అనంతరం భజన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని పొంగళ్లు సమర్పించారు.

మామిడి, బత్తాయి మొక్కల పంపిణీ



నకరికల్లు: గిరిజనుల సుస్థిర అభివృద్ధి కోసం నాబార్డు సహకారంతో అవార్డు సంస్థ పని చేస్తోందని సంస్థ కో ఆర్డినేటర్ ఎం.సుధాకర్ తెలిపారు. మండలంలోని ఉదయ్‌నగర్‌కాలనీలో మామిడి, బత్తాయి మొక్కలను శుక్రవారం పంపిణీ చేశారు. . మిర్చి, పత్తి పంటలకు పెట్టుబడులు పెరిగి దిగుబడులు తగ్గిన తరుణంలో నష్టాల బాట పట్టాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. పెట్టుబడులు తగ్గించి సుస్థిర ఆర్థికాభివృద్ధి కోసం పండ్ల మొక్కలు పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఏఎస్‌ఎస్ సంస్థ ప్రతినిధులు మెరిసిల్లా, కుమారి, అవార్డు సంస్థ ప్రతినిధులు ప్రకాష్, శ్రీనివాసరావు, మధు పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శిగా లక్ష్మాచారి

అచ్చంపేట: బీజేపీ ఓబీసీ మోర్చా పల్నాడు జిల్లా కార్యదర్శిగా గ్రామానికి చెందిన పడగండ్ల లక్ష్మాచారిని నియమించినట్లు జిల్లా అధ్యక్షులు అన్నపురెడ్డి వెంకటేశ్వర్లు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. లక్ష్మాచారిని రామాచారి, సత్యనారాయణాచారి, ఆంజనేయులు అభినందించారు.

బడుగుల పిడికిలిదే అంతిమ విజయం

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- బీసీ గర్జన విజయవంతానికి సన్నాహక సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: ఏనాడు నేను అధికారం కోసం వెంపర్లాడలేదని, నమ్ముకున్న వ్యక్తి కోసం ఎంత దూరమైనా వెళ్లేవాడే మీ అంబటి రాంబాబు అని... నా కార్యకర్తలు గర్వంగా చెప్పుకునేలా నేను వైఎస్సార్ కుటుంబంతోనే నడిచానని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఈనెల 22వ తేదీన నిర్వహించనున్న బీసీ గర్జన సభ విజయవంతానికి శుక్రవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానికి పట్టణ నాయకుడు సంకుల తిరుపతిరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి, ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని నమ్ముకొని వారి వెంట నడిచానన్నారు. నాడు తెలుగుదేశం పార్టీ 'నిమ్మకాయలకు' అన్యాయం చేస్తే నేడు సీఎం జగన్‌మోహన్ రెడ్డి న్యాయం చేశాడని చెప్పారు. ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన గుంటూరు మిర్చి యార్డు చైర్మన్‌గా పదవి వచ్చేలా శక్తి వంచన లేకుండా కృషి చేసి మిమ్మల్ని ఓటు అడిగే హక్కు సాధించానన్నారు. బీసీలంతా నాకు అండగా ఉన్నంతకాలం నన్ను ఓడించడం ఎవరివల్లా కాదని చెప్పారు. బడుగు, బలహీన వర్గాలదే అంతిమ విజయమని స్పష్టం చేశారు. గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ యాదవ్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బడుగు, బలహీన వర్గాలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూసిందని, ఏనాడు పదవులు ఇవ్వలేదని దుయ్యబట్టారు. 47 ఏళ్లల్లో యాదవులను ఏనాడు రాజ్యసభకు పంపలేదని పేర్కొన్నారు. ఇద్దరు యాదవ సమాజానికి చెందిన వారికి రాష్ట్ర స్థాయి పదవులు ఇవ్వటం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే సాధ్యమైందని వివరించారు. మంత్రి అంబటి రాంబాబు చొరవతోనే మనం రాజకీయంగా ఎదుగుతున్నామని గుర్తు చేశారు. సమావేశంలో సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబూరావు, పార్టీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, మండల కన్వీనర్లు భవనం రాఘవరెడ్డి, ఏపూరి శ్రీనివాసరావు, రాయపాటి పురుషోత్తమరావు మాట్లాడారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కట్టా సాంబయ్య, పార్టీ నాయకులు కొర్లకుంట వెంకటేశ్వర్లు, ఎంజేఎం రామలింగారెడ్డి, నక్క శీను, జేసీఎస్ ఇన్‌చార్జిలు రెండెద్దుల వెంకటేశ్వర రెడ్డి, మేడం ప్రవీణ్‌రెడ్డి, పులిబండ్ల ఆశోక్, వెంకటరెడ్డి, నాయకులు గడ్డం వెంకటేశ్వర్లు (బుల్లోడు), లోకా మాధవ, గంటా ఏసుబాబు, మర్రి సుబ్బారెడ్డి, దొంతిరెడ్డి శ్రీనివాస రెడ్డి, సిరిగిరి గోపాలరావు, తేలుకుట్ల చంద్రమౌళి, చిలకా జైపాల్, ముదినేడు సుబ్బయ్య పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

- గృహ నిర్మాణ శాఖ కార్పొరేషన్ ఎండి లక్ష్మీశా
- సత్తెనపల్లి మండలం ధూళ్లపాళ్ల లే అవుట్ పరిశీలన

సత్తెనపల్లి: నవరత్నాలు – పేదలందరికీ ఇళ్ల పథకం ద్వారా నిర్మిస్తున్న పక్కా గృహాలను త్వరితగతిన నిర్మించాలని గృహ నిర్మాణ శాఖ కార్పొరేషన్ ఎండీ జి.లక్ష్మీశా ఆదేశించారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ధూళ్లపాళ్లలోని లే అవుట్‌ను శుక్రవారం పరిశీలించారు. లే అవుట్‌లో మొత్తం 1,149 గృహాలు మంజూరు కాగా 975 గృహాలు గ్రౌండ్ కాగా వీటిలో 300 గృహ నిర్మాణాలు పూర్తి కాగా 675 గృహాలు వివిధ స్టేజీల్లో ఉన్నాయి. ఆ గృహాలను ఆయన పరిశీలించి మిగిలిన గృహాలను కూడా త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. మంజూరైన 1,149 గృహాలు నిర్మించుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. గృహ నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టర్లు పిలిచి త్వరితగతిన గృహ నిర్మాణాలు చేపట్టాలని, బిల్లులకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. జాప్యం లేకుండా బిల్లులు వెంటనే విడుదల చేయడం జరుగుతుందని, కనుక అన్ని గృహాలను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. బిల్లులకు ఎలాంటి జాప్యం లేదు కనుక ఇళ్ల నిర్మాణం వేగవంతం చేసేలా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. మౌలిక వసతుల కల్పనపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పీడీ ఎస్.వేణుగోపాలరావు, డీఈ వి.శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, మున్సిపల్ ఏఈ సాగర్, గృహ నిర్మాణ శాఖ ఏఈ సుబ్బారావు పాల్గొన్నారు.

నేడు పంచాయతీ వార్డు స్థానాలకు పోలింగ్



పోలింగ్ సామగ్రితో తరలివెళ్తున్న ఎన్నికల సిబ్బంది

అచ్చంపేట: మండలంలో ఖాళీ అయిన నాలుగు పంచాయతీ వార్డు సభ్యుల స్థానాలకు శనివారం పోలింగ్ దృష్ట్యా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ పి.శివ సుబ్రహ్మణ్యం శుక్రవారం తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. రెండు గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభించనున్నట్లు చెప్పారు. కౌంటింగ్ పూర్తి కాగానే ఫలితం ప్రకటించనున్నట్లు ఎంపీడీఓ వెల్లడించారు.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

అమరావతి: మండల పరిధిలోని ఎండ్రాయి, ధరణికోట గ్రామాలలోని వార్డు మెంబర్ స్థానాలకు శనివారం నిర్వహించనున్న ఉప ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఈఓపీఆర్డీ ప్రసాదబాబు శుక్రవారం తెలిపారు. ధరణికోటకు సంబంధించి ఆర్‌వీ వీఎస్ కళాశాలలో, ఎండ్రాయికు సంబంధించి ఎంపీపీ పాఠశాలలో పోలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు.

నేడు హసనాబాద్‌లో..

క్రోసూరు: మండలంలోని హసనాబాద్ గ్రామంలోని మూడో వార్డుకు శనివారం ఉప ఎన్నిక పోలింగ్ నిర్వహించనున్నట్లు స్టేజ్–1 ఎన్నికల అధికారి ఎస్.ప్రభాకరరావు శుక్రవారం తెలిపారు. ఎంపీయూపీ పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికలను ఎంపీడీఓ బి.మహేష్, విస్తరణాధికారి పి.శివరామయ్య పర్యవేక్షించనుండగా (స్టేజ్ –2 అధికారి) గా క్రోసూరు జెడ్పీ పాఠశాల హెచ్ఎం రామాంజనేయులు వ్యవహరించారు.

క్రోసూరు: పంచాయతీ ఉప ఎన్నికలకు పూర్తి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ పాల్ రవీంద్ర శుక్రవారం తెలిపారు.

నేడు గుండ్లపల్లి 5వార్డు ఎన్నిక

నకరికల్లు: మండలంలోని గుండ్లపల్లి పంచాయతీ పరిధిలోని 5వార్డు ఎన్నిక నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు స్టేజ్–1 ఎన్నికల అధికారి ఎంకేఎస్ గిరిధర్ శుక్రవారం తెలిపారు.

విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలి



గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ప్రారంభిస్తున్న ఎంఈఓ రాజకుమారి

బెల్లంకొండ: విద్యార్థులు ఖాళీగా ఉన్న సమయాలలో గ్రంథాలయ పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని ఎంఈఓ బి.రాజకుమారి తెలిపారు. శుక్రవారం మండలంలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలకు ఎస్‌ఆర్‌ఐ– వాసవి అసోసియేషన్ వారు రూ.38వేల విలువ చేసే గ్రంథాలయ పుస్తకాలను అందజేశారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాలను సద్వినియోగం చేసుకుని జ్ఞానాన్ని, వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఎంఈవో–2 బాల సుందరరావు మాట్లాడుతూ గ్రంథాలయ పుస్తకాల ద్వారా ప్రపంచంలోని విశేష వ్యక్తులు, వివిధ భాషలతో గల పుస్తకాలు, వాటిలోని నీతి, ధర్మ సూక్ష్మములు గ్రహించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వి.శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో నేత్ర, దంత వైద్యసేవలందించాలి



క్రోసూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

క్రోసూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నేత్ర, దంత వైద్య సేవలందించే విధంగా చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు జమీలా గఫార్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి ఎంపీపీ పి.కోటయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ అనుమతి లేకుండా నిర్మించుకున్న ఇళ్లకు హౌసింగ్ శాఖ బిల్లులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఏఈ వెంకట్రావుకు విన్నవించారు. స్పందించిన ఏఈ, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని చెప్పారు. జగనన్న కాలనీల్లో ఇళ్లతో పాటు మరుగుదొడ్డి నిర్మాణం పూర్తి చేసుకున్న వారు బిల్లులు పొందవచ్చని వివరించారు. సమావేశంలో ఎంపీడీఓ బి.మహేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ



వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు సందర్భంగా భూమి పూజ చేస్తున్న పీవీఆర్

దుర్గి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి శుక్రవారం కంచరగుంట గ్రామంలో భూమి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేస్తున్న వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీఆర్‌ని సత్కరించారు. ముందుగా చర్చిలో ప్రార్థనలు చేశారు. అనంతరం పీవీఆర్ మాట్లాడుతూ వైఎస్సార్ పేదల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి చిరస్థాయిగా నిలిచారన్నారు. ఆయన పై ప్రేమతో స్థానిక నేతలు, ప్రజలు ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అయన తనయుడు సీఎం జగన్ అవినీతి రహిత పాలన చేస్తున్నారన్నారు. ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మాచర్ల నియోజకవర్గం అభివృద్ధిలో ఉందన్నారు. త్వరలోనే వరికపూడిసెల నిర్మాణానికి భూమి పూజ, శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. యానాది కాలనీ వాసులు నూతనంగా నిర్మిస్తున్న దుర్గా భవాని ఆలయ నిర్మాణానికి ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళలు కుంకుమ తిలకం దిద్ది సాధారణంగా ఆహ్వానించి తమ ప్రత్యేక అభిమానాన్ని చాటుకున్నారు. ఈ క్రమంలో వెల్దుర్తి ఎంపీపీ చింతా ఆదినారాయణ, సర్పంచ్ బీర్నిడి మాణిక్యరావు, ఎంపీటీసీ బొంత కృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు మాదాసు వెంకటేశ్వర్లు, దేవరకొండ పున్నారావు, పెద్ద సాంబయ్య, మాదాసు వాసు, కోట రాజు, వేముల వెంకటేశ్వర్లు మాస్టర్, మాచర్ల టౌన్ వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు కందుకూరి రత్నరాజు, రాజానగరం మాజీ సర్పంచి జక్కా రమేష్, బోజ్యానాయక్, బొంత గాంధీ, మోతీలాల్ నాయక్, సచివాలయం కన్వీనర్లు శ్రీరామ్‌మూర్తి, దానయ్య, కల్లూరి రాజేష్, సుబ్రహ్మణ్యం నాయక్, కోట శిమోను, దేశం నాగిరెడ్డి, మాదాసు శ్రీనివాస రావు, కొండలు, రాళ్ళపల్లి శ్రీను, మాదాసు గోపయ్య, కోట శివ, పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

మాచవరం: మైనర్ బాలిక కనిపించడం లేదంటూ స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు అందినట్లు ఎస్ఐ ఎస్.కోటయ్య తెలిపారు. మండల పరిధి గ్రామానికి చెందిన మైనర్ బాలిక ఈనెల 15 అర్ధరాత్రి సమయంలో ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లి పోయింది. బాలిక ఆచూకీ కోసం బంధుమిత్రల వద్ద వెతికారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో బాలిక తల్లి భూలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

పిడుగురాళ్ల: లయన్స్ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల(అక్షయ) సంఘం, ఏషియన్ వాస్కుర్ హాస్పటల్ హైదరాబాద్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఉచిత చర్మ, రక్తనాళాల వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వీరబ్రహ్మేంద్రస్వామి వారి దేవస్థానం టింబర్ డిపో సెంటర్‌లో నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఉదయం 10 గంటలను నుంచి 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని వారు తెలియజేశారు.

మణిపూర్ ఘటన అమానుషం

గురజాల: మణిపూర్‌లో జరిగిన ఘటన అమానుషమని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు యాగనిరాజు అన్నారు. స్థానిక నందనం వెంకటరావు నగర్ కాలనీలో శుక్రవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో ఆదివాసీలపై జరుగుతున్న మారణహోమాన్ని నిలుపుదల చేయాలని, ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి సామూహిక లైంగిక చేసిన దుండగులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. బీరేన్ సింగ్ ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.పోతురాజు, జిల్లా సహాయ కార్యదర్శి రెడ్డి శ్రీను, నాయకులు షేక్ నబీ, యలమంద, శ్రీను, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు చెక్‌పోస్ట్ నూతన భవనం ప్రారంభం



నూతన భవనం ప్రారంభిస్తున్న డీటీసీ పరందామరెడ్డి

దాచేపల్లి : రవాణశాఖ రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ నూతన భవనాన్ని శుక్రవారం ప్రారంభించారు. సాగర్ సిమెంట్స్ ఆధ్వర్యంలో సీఎస్సార్ కార్యక్రమంలో భాగంగా రూ. 30 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన భవనాన్ని మండలంలోని పొందుగల గ్రామ సరిహద్దులో డీటీఓ పరందామరెడ్డి, సాగర్ సిమెంట్స్ ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ పి. బిక్షారెడ్డి ప్రత్యేకంగా పూజలు చేసి ప్రారంభించారు. త్వరలో నూతన భవనం నుంచి సరిహద్దు చెక్‌పోస్ట్ కార్యకలపాలు నిర్వహిస్తామని డీటీఓ పరందామరెడ్డి చెప్పారు. కార్యక్రమంలో ఎంవీఐ శేషరెడ్డి, ఎఎంవీఐలు బి. శ్రీనివాసరావు, సురేష్, కెఎల్. రావు, సాగర్ సిమెంట్స్ జీఎం ప్రభాకర్‌రావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాగుకు సన్నద్ధం



సాగుకు సిద్ధంగా ఉన్న వరి నారు

పిడుగురాళ్ల: పల్నాడు ప్రాంతంలో గత రెండు రోజుల నుంచి వర్షం కురవడం, మబ్బులు పట్టి వాతావరణం కూలుగా ఉండడంతో రైతులు పొలం బాట బట్టారు. కొంత మంది ముందుగానే వేసిన పొలాలను చదును చేస్తుంటే మరికొంత మంది చదును చేసిన పొలాల్లో విత్తు నాటేందుకు సిద్ధమవుతున్నారు. దీనిలో భాగంగా పిడుగురాళ్ల పట్టణ వివారుల్లోని నర్సరీలలో మిర్చి నారు, సొంత పొలాల్లో మిర్చి నారు, వరి నారు పోసి వరి, మిరప పంటలను వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. దీంతో నారు పోసిన ప్రాంతాలన్ని భూమికి పచ్చరంగు వేసినట్లు తయారు అయ్యాయి.